క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

లావేరు: మండలంలోని బుడతవలస పంచాయతీ నీలాపురం గ్రామానికి చెందిన బందాన రామకృష్ణ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు మెట్టవలస హైస్కూల్‌లో చదువుకున్నాడు. పేద కుటుంబం కావడంతో పూర్వ విద్యార్థులు రూ.52వేలు సేకరించారు. గురువారం నీలాపురం వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మజ్జి రామూర్తి, జగ్గురోతు కృష్ణ, కెల్ల రామునాయుడు, పొన్నాడ రాంబాబు, ముద్దాన నారాయణరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గార: బలరాంపురం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ దొంగ మస్తర్లు వేస్తున్నారంటూ అదే గ్రామానికి చెందిన మేట్ లక్ష్మమ్మ స్పందనలో ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు. గురువారం ఎచ్చెర్ల ఏపీడీ కె.లోకేశ్వరరావు గ్రామసభ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతిలక్ష్మీ తన నచ్చిన వారికి పనికిరాకుండానే మస్తర్లు వేస్తోందన్న అంశంపై రికార్డులు పరిశీలించి, వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్యారాణి, జేఈ నారంనాయుడు పాల్గొన్నారు,

కషాయంతో తెగుళ్ల నియంత్రణ



తయారీ విధానం వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: వావిలాల ఆకు కషాయంతో తెగుళ్లను నియంత్రించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ట్రైనర్ అరుణ అన్నారు. ముద్దాడలో గురువారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వావిలాల ఆకు కషాయం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఐదు కిలోల ఆకులు, 15 లీటర్ల ఆవు మూత్రం కలిపి వేడి చేయాలని, మూడు పొంగుల తరువాత చల్లార్చి పంటలకు పిచికారీ చేస్తే తెగుళ్ల నియంత్రణ సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ధనలక్ష్మి, అప్పలనర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం



వాండ్రంగి జంక్షన్‌లో కుక్కల గుంపు

జి.సిగడాం: మండలంలోని జి.సిగడాం, మెట్టవలస, ఎస్.భీమవరం, పెంట, గెద్ద కంచరాం, సంతవురిటి డి.ఆర్.వలస, దేవరవలస, వెలగాడ, వాండ్రంగి తదితర గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా వచ్చి మూగజీవులపై దాడి చేస్తున్నాయి. ఇప్పటికే గొర్రెలు, మేకలు, దూడలు కుక్కల బారిన పడి గాయపడటంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని గెద్దకంచరాం, జాడ, దేవరవలస, ఎందువ, పెంట, జి.సిగడాం, ఆనందపురం గ్రామాల్లో గురువారం షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 100 అడుగుల వెంకటి సాయికోటి మహా స్థూపం, నాగసాయి విగ్రహాల వద్ద భక్తులు వ్రతాలు చేశారు.

ఇంగ్లిష్ వ్యాకరణంపై శిక్షణ

ఎల్.ఎన్.పేట: డొంకలబడవంజలో ఇంగ్లిష్ వ్యాకరణంపై శిక్షణ ఇస్తున్నట్లు ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా డొంకలబడవంజ ప్రజా గ్రంథాలయం (బీడీసీ)లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు భాషపై పట్టు సాధించేందుకు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్



దేవరవలసలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: బడుగు, బలహీన వర్గాలను గుర్తించి అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం జి.సిగడాం మండలం దేవరవలస సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు మరోసారి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జిల్లా సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరరావు, ఎంపీటీసీ సభ్యులు తిరుమరెడ్డి విజయలక్ష్మి, తిరుమరెడ్డి లక్ష్మణరావు, జక్కంపూడి రమణ, జనసాల ధనుంజయరావు, వైఎస్సార్‌సీపీ మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వాన ప్రమీల, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఎంఈఓ అరసాడ రవి, ఏఈఈలు మహాదాసు రమేష్, బగాది భాగ్యలక్ష్మి, ఏపీఎం రెడ్డి రామకృష్ణం నాయుడు, ఏపీఓ బోళ్ల సత్యనారాయణపాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో..

దేవరవలస సచివాలయం పరిధిలోని కప్పరాం, మంగమ్మపేట, దేవరవలస గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మీసాల సత్యవతి తెలిపారు. ఎమ్మెల్యే కిరణ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

జగన్‌బాబు ఆదుకున్నారు..



నాకు నలుగురు కుమారులు, ఓ కుమార్తె. కుమార్తె దివ్యాంగురాలు. పెళ్లి కాలేదు. మాలాంటి వారికి జగన్‌బాబు అండగా నిలించారు. అధికారంలోకి రాగానే పింఛన్లు, ఆసరా పథకాలు మంజూరు చేశారు. మా ఇద్దరికీ నాలుగేళ్ల పాలనలో రూ.4లక్షల 36 వేల లబ్ధి పథకాల రూపంలో సమకూరింది.

– ఎస్.రమణమ్మ, ఎస్.మంగమ్మ, దేవరవలస

కార్పొరేట్ హంగులకు మోసపోవద్దు



చంద్రయ్యపేటలో పాఠశాల పనితీరును వివరిస్తున్న హెచ్‌ఎం

జి.సిగడాం : నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గుచూపాలని, కార్పొరేట్ హంగులు చూసి మోసపోవద్దని చంద్రయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేకల రమేష్ చిన్నారుల తల్లిదండ్రులకు హితవుపలికారు. గురువారం వెలగాడ, చంద్రయ్యపేట, గదబపాలెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాల పనితీరు, విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పథకాలపై వివరించారు. ఉత్తమ బోధన, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మక్క గంగేశ్వరి, వల్లూరు రమణ, కుప్పిలి పద్మావతి, ఉరిటి సతీష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హిందీ భాషా పండితుల వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీ–2002 హిందీ భాషా పండితులకు జీతాలు చెల్లించాలని కోరుతూ భాషా పండితుల జిల్లా అధ్యక్షుడు(ఎస్ఎల్‌టీఏ) పిసిని వసంతరావు, రంగనాయకులు, కె.శ్రీనివాసరావు తదితరులు జిల్లా ఖజానాశాఖ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 46 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముస్లిం విద్యార్థులకు అభినందనలు



ఉత్తీర్ణులైన విద్యార్థులతో ముస్లిం పెద్దలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలో ఇంటర్మీడియెట్, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన 60 మంది ముస్లిం విద్యార్థులకు ఆలిండియా మిల్లీ కౌన్సిల్, ముస్లిమ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌కె సలీమ్ సాహెబ్ అధ్యక్షతన బహుమతులు అందజేశారు. అభ్యుదయ కళాశాలలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి వీజీకె మూర్తి (గరిమెల్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు), శ్రీనివాస్ (సీఐటీయూ) ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు షెల్టర్ ఇవ్వొద్దు



లాడ్జీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ గణేష్

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలు జరిపేవారికి, పేకాట ఆడేవారికి లాడ్జిల్లో షెల్టర్ ఇవ్వొద్దని.. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే తమకు సమాచారం అందించాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ నిర్వాహకులకు సూచించారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు నగరంలోని మూడు లాడ్జీలను బుధవారం అర్ధరాత్రి 12:30 గంటల తర్వాత తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు పనిచేసేలా ఉండాలని, కస్టమర్ ఆధార్‌కార్డు, ఫోన్ నంబరును, చిరునామా తదితర వివరాలను రిజిస్టర్‌లో కచ్చితంగా పొందుపర్చాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వేసవి నేపథ్యంలో దొంగతనాలు చేసే వారు లాడ్జీల్లో స్టే అయ్యేందుకు వస్తుంటారని, అటువంటి వారు తారసపడితే సమాచారం ఇవ్వాలన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు



శ్రీకాకుళం అర్బన్: చిన్నారులకు నీతివాక్యాలు చెబుతున్న ఉపాధ్యాయుడు ఈశ్వరరావు

గార: మండల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'పర్యావరణ – పరిరక్షణ' అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. అనంతరం నీతికథల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకృష్ణ, ఎం.జనార్దనరావు, జి.వి.శరత్‌చంద్ర, చింతల సూర్యనారాయణ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రణస్థలం: విద్యార్థులకు బాల్యం నుండే క్రమశిక్షణ అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి.బి.జి.ఎస్.శంకర్ అన్నారు. రణస్థలం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, కథల పోటీలు నిర్వహించారు. రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి, ఆంగ్ల ఉపాధ్యాయుడు కె.భాస్కరరావు, విశ్రాంత ఉద్యోగి ఆర్.ధర్మారావు పాల్గొన్నారు.



రణస్థలం: రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి శంకర్

పద్యాలు నేర్చుకోవాలి

లావేరు: విద్యార్థులు తెలుగు పద్యాలపై పట్టు సాధించాలని లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాల అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులు తెలుగు పద్యాలు, కథల పఠనంపై పోటీలు నిర్వహించారు. వేసవిలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎం.నీలమ్మ కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు టి.ఎర్రమ్మ, ఎస్.ఈశ్వరరావులు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిబిరాల్లో భాగంగా చిన్నారులకు డ్యాన్స్, సంగీతం, తెలుగు నీతి వాక్యాలు తెలియజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.ఈశ్వరరావు, గణేష్, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గార: వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తక పఠనంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం



లావేరు: విద్యార్థులతో పద్యాలు చెప్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

రూ.10 లక్షలతో రహదారి అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా బూరగాం నుంచి పర్లాకిమిడికి రహదారి అభివృద్ధి (మరమ్మతులు) రూ.10 లక్షల ప్రత్యేక నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. గురువారం బూరగాం గ్రామ సమీపంలోని మహేంద్రతనయ నది వద్ద రహదారి పనులకు ఉత్సవ కమిటీతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు పాతపట్నంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండడానికి బూరగాం వయా నీలకంఠేశ్వర ఆలయం మీదుగా పర్లాకిమిడి (ఒడిశా) రహదారికి మళ్లింపు చేయనున్నామన్నారు. కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడి రూ.10 లక్షల ప్రత్యేక నిధులు కేటాంచారని పీఆర్ డీఈఈ ఆర్.ఎస్.ప్రసాద్ తెలిపారు. పీఆర్ జేఈ టి.ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎల్.వి.మధు, ఎల్.రవి కుమార్, కాళ్ల రాజు, నూలు బుజ్జి, ఎస్.ప్రదీప్, మల్లికార్జునరావు, ఎస్.మధుబాబు, జోగారావు, యరకయ్య, నూలు ఈశ్వరరావు, బాబూరావు, బూరగాం, కాగువాడ సర్పంచ్‌లు బిజిలి పుల్లాయ్, నల్లి రాజారావు, ప్రహల్లాద పుల్లాయ్, డి.పార్వతీశం, ఎం.తాతయ్య, వై.సూర్యం, ప్రభాకరరావు, పనుకు మోహన్, జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త



సీఐ పప్పల శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : నగర పౌరులు సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు గురువారం సూచించారు. ఎవరైనా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి కేవైసీ చేయాలి, ఓటీపీ చెప్పండంటూ అడుగుతారని, గిఫ్ట్ రూ.కోటి లాటరీగా వచ్చింది.. కొంత సొమ్ము పంపండంటూ లింక్ పంపుతారని.. అటువంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. డియర్ కస్టమర్ యువర్ ఎలక్ట్రిసిటీ పవర్ విల్ బి డిస్కనెక్టెడ్ టునైట్ ఎట్ 9:30 పీఎం ఫ్రం ఎలక్ట్రిసిటీ ఆఫీస్.. ప్లీజ్ ఇమీడియట్‌లీ కాల్ ఎలక్ట్రిసిటీ ఆఫీసర్ నెంబర్ 9696969696 అని మెసేజ్ వస్తుందని, వీలుంటే ఫోన్ పే ద్వారానైనా నంబర్‌కు అమౌంట్ పంపించాలని ఉంటుందని, అలాంటి వాటికి స్పందించవద్దని చెప్పారు. డియర్ ఎస్‌బీఐ కస్టమర్ యువర్ ఎస్‌బీఐ యోనో అకౌంట్ హేజ్ బీన్ సస్పెండెడ్ టుడే. ప్లీజ్ అప్‌డేట్ యువర్ పాన్‌కార్డ్ నంబర్ క్లిక్ హియర్ లింక్ హెచ్‌టీటీపీఎస్: //ఆర్‌బి.జివై/పివైఎఎక్స్‌బి6 అని వస్తుందని, ఎవరూ నమ్మవద్దని అన్నారు. పార్ట్‌టైం జాబ్ ఆఫర్, వర్క్ ఫ్రం హోమ్ వంటి జాబ్ ఫ్రాడ్ మోసాలు, సైబర్ నేరాలపై మహిళా పోలీసులతో సచివాలయ పరిధిలో ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



లోపెంటలో సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

లావేరు: సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. లావేరు మండలం లోపెంట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం భవనాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పల్లెల్లోనే ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పాల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ సీతంనాయుడు, ఏఈ లింగాల అప్పన్న, తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైస్ ఎంపీపీ అలుపున రమణమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్ బాషా, నాయకులు జీరు నాగార్జునరెడ్డి, అలుపున మల్లేశ్వరరెడ్డి, అలుపున కోదండరామిరెడ్డి, అలుపున మల్లేశ్వరరావు, జీరు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



అధికారులు, ప్రజా ప్రతినిధులతో క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని గురువారం రాష్ట్ర ఒలింపిక్ అసోషియేషన్ ముఖ్య సలహాదారు సుందరావు ప్రారంభించారు. ఈనెల 24 వరకు శిబిరం కొనసాగనుంది. సాఫ్ట్‌బాల్ జూనియర్ జట్టు రాష్ట్రస్థాయి పోటీలు కడప జిల్లాలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 60 మందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో మెరుగైన ప్రదర్శన ఆధారంగా తుది జట్టును ఎంపిక చేయనున్నారు. శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తి, విజిలెన్స్ ఎస్సై తారకేశ్వరరావు, హెచ్‌ఎం జి.కృష్ణకుమారి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



ప్రసవం అనంతరం బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

టెక్కలి: నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన పి.నీరజ అనే గర్భిణి గురువారం వేకువజామున 108 వాహనంలో ప్రసవించారు. గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతున్నట్లు టెక్కలి 108 సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో ఈఎంటీ సింహాచలం, పైలట్ శశిభూషణరావులు వాహనంతో పెద్దతామరాపల్లి చేరుకున్నారు. నీరజను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో, సిబ్బంది ప్రాథమిక వైద్యాన్ని అందజేసి ప్రసవం చేయించారు. దీంతో ఆయా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

రైతులకు యంత్ర పరికరాల పంపిణీ



రైతు సంఘానికి యంత్ర పరికరాలను అందజేస్తున్న ఏడీ, తదితరులు

నరసన్నపేట: రైతు సంఘాలకు యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి తెలిపారు. ప్రతీ ఆర్‌బీకేలో ఒక్కో రైతు సంఘానికి యంత్ర సహకారం 40 శాతం సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. ఏడీ పరిధిలోని నాలుగు మండలాల్లో 91 ఆర్‌బీకేలు ఉండగా.. 52 ఆర్‌బీకేల్లో ఉన్న రైతు సంఘాలకు యంత్ర సహకారం అందించామన్నారు. ఈ సంవత్సరం మిగిలిన ఆర్‌బీకేల్లో ఉన్న సంఘాలకు యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రావులవలసలో రైతు సంఘానికి ఇచ్చిన యంత్ర పరికరాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి కె.సునీత, నరసన్నపేట డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఇప్పిలి సీతారాం, ఫీల్డ్ అసిస్టెంట్ అక్కయ్యరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుల్లయ్య, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పది తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పది ఫలితాల్లో తప్పిన విద్యార్థులందరూ పాసే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినా.. ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలల్లో 84 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరందరికీ ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నారు. గురువారం నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు సత్యవరం, ఉర్లాం, నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటరావు అన్నారు. ఎంఈఓ శాంతరావు కూడా ప్రత్యేక తరగతులపై దృష్టి పెట్టారు. అవసరమైతే ఉపాధ్యాయులే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి క్లాసులు తీసుకుంటున్నారని అన్నారు.